నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, ఆదివారం 27 అక్టోబర్ 2024 | NIZAMABAD

- అర్బన్ డెవలప్ అథారిటీ వ్యవహారంపై చర్చ
- నిజామాబాద్‌లో నుడా పరిధి భారీగా పెంపు
- 3 మున్సిపాలిటీలు, 380 గ్రామాలకు విస్తరణ..
- కామారెడ్డికి కుడా పేరుతో కొత్తగా ఏర్పాటు
- ఇక్కడా 3 మున్సిపాలిటీలు, 460 గ్రామాలు

ప్రజల కోసమా.. పదవుల కోసమా?

ఎందుకింత ఉడావుడి?

నిజామాబాద్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఉడా)ల విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై గందరగోళం నెలకొంది. ఇప్పటికే ఉన్న నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) పరిధిని ప్రభుత్వం భారీగా పెంచుతూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. అదే సమయంలో కామారెడ్డికి కొత్తగా కామారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా)ను ఏర్పాటు చేస్తూ 3 మున్సిపాలిటీలు, 460 గ్రామాలను దాని పరిధిలోకి చేర్చింది. అక్టోబర్ 15నే గవర్నర్ పేరిట గెజిట్ నోటిఫికేషన్ సైతం విడుదల కాగా, ఈ సమాచారాన్ని ప్రభుత్వం రహస్యంగా ఉంచింది. అయితే, ప్రజాభిప్రాయాలతో సంబంధం లేకుండా ప్రభుత్వం హడావుడిగా నిర్ణయాలు తీసుకోవడం, రహస్యంగా ఉత్తర్వులు ఇవ్వడం తీవ్ర చర్చనీయాంశమైంది. అసలు నుడా పరిధి పెంపు, కుడా ఏర్పాటు వల్ల సామాన్య ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఏమిటన్న దానిపై ఆసక్తికర చర్చ జరుగుతున్నది. ఇదంతా పదవులు, అధికారాల కోసమా.. లేక మరేదైనా మర్మమున్నదా? అన్న దానిపై రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. నుడా, కుడాకు పాలకవర్గాలు ఉంటాయి. ఈ నేపథ్యంలోనే రాజకీయ నిరుద్యోగులకు వాటిలో చోటు కల్పించడానికే ప్రభుత్వ తాజా నిర్ణయాలని చెబుతున్నారు.

దాదాపుగా జిల్లా అంతా నుడానే..

అభివృద్ధి పేరిట నుడా పరిధిని భారీగా విస్తరించారు. హెచ్ఎండీఏ మాదిరిగానే అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు పని చేస్తాయంటూ ఉత్తర్వుల్లో పేర్కొంటూ పాత నుడాను జిల్లా అంతటికీ వర్తించేలా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. కేసీఆర్ హయాంలో పురుడు పోసుకున్న నుడా పరిధిలో 75 వరకు గ్రామాల పరిధి ఉండేది. నిజామాబాద్ కార్పొరేషన్‌తో పాటుగా నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బోధన్ నియోజకవర్గాల్లోని కొంత భాగం నుడాలో కలిపారు. కానీ ఇప్పుడు దాదాపుగా నిజామాబాద్ జిల్లాలోని 6 నియోజకవర్గాలను నుడా పరిధిలోకి తెచ్చారు. కొత్త గెజిట్ నోటిఫికేషన్‌లో ఆర్మూర్, భీమ్‌గల్, బోధన్ మున్సిపాలిటీల పరిధిని, 380 గ్రామాలను నుడా కిందకు తీసుకొచ్చారు. కామారెడ్డిలో కొత్తగా ఏర్పాటైన కామారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) సైతం దాదాపుగా జిల్లా మొత్తానికి వర్తించేలా ఉంది. ఎల్లారెడ్డి, బాన్సువాడ, కామారెడ్డి మున్సిపాలిటీలను, 460 గ్రామాలను అందులో చేర్చారు. పెరుగుతున్న పట్టణీకరణలో భాగంగా ప్రజలకు మెరుగైన వసతుల కల్పన, మౌలిక సదుపాయాల వృద్ధిలో భాగంగా వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నది.

ఇప్పటికే ఉన్న నుడా పరిధి

ప్రస్తుతం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు డెలిగేషన్ పవర్స్ లేవు. కలెక్టర్ ద్వారానే వెంచర్ల అనుమతులు జారీ చేస్తున్నారు. మరోవైపు ఆదాయం సైతం నేరుగా డీటీసీపీకి ఆన్‌లైన్‌లోనే బదిలీ అవుతుంది. కొద్ది కాలానికి ఆయా ప్రాంతాలను అనుసరించి ఆదాయాన్ని అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలకు బదిలీ చేస్తున్నారు. నుడా, కుడా పరిధులను విస్తృతం చేయడం ద్వారా ఆదాయ పంపిణీలో పారదర్శకత కనిపిస్తుందా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. జీపీలు, బల్దియాల పరిస్థితి ఏమవుతుందన్నది చర్చనీయాంశమైంది. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు డెలిగేషన్ పవర్స్ సంక్రమిస్తేనే వీటికి అర్థం ఉంటుందన్న వాదన కూడా వినిపిస్తుంది. ఒకవేళా అధికారాలను కట్టబెడితే ఎమ్మెల్యేలు అడ్డుకునే అవకాశాలు లేకపోలేదు. జిల్లా భౌగోళిక స్వరూపంలో 90 శాతానికి విస్తరించిన నుడా, కుడా పరిధితో పాలకవర్గాలకు పెత్తనం చెలాయించే అవకాశం దక్కుతుందా.. లేదా? అన్నది అనుమానంగా ఉంది.

హామీలు ఎగ్గొట్టేందుకే కొర్రీలు

- ఆంక్షలతో రుణమాఫీ గోల్‌మాల్
- రైతుబంధుకు రాంరాం చెప్పిన కాంగ్రెస్
- కేసీఆర్ పాలనలో రైతు ఆనందం
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

కమ్మర్‌పల్లిలో గోదాం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్/ముప్కాల్(బాల్కొండ), అక్టోబర్ 26: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎగ్గొట్టేందుకే అనేక కొర్రీలు పెడుతున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. ఆంక్షలు పెట్టి రుణమాఫీని గోల్‌మాల్ చేశారని, రైతుభరోసాను ఎగ్గొట్టారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ పాలనలో రైతురాజ్యం ఉంటే, కాంగ్రెస్ హయాంలో రైతాంగం ఆగమాగవుతున్నదని తెలిపారు. శనివారం శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో చేపపిల్లలను విడుదల చేసిన ప్రశాంత్ రెడ్డి.. కమ్మర్‌పల్లి మండలంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న రెండు గోదాములకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. పొరపాటున వేరే ప్రభుత్వం వస్తే రైతుబంధుకు రాంరాం చెప్తారని కేసీఆర్ ముందుగానే చెప్పారని, ఆయన చెప్పినట్లుగా రేవంత్ సర్కారు రైతుబంధును ఎగ్గొట్టిందన్నారు. వానకాలం రైతుభరోసా ఇస్తామని కాలం వెళ్లదీసిన ప్రభుత్వం.. ఇప్పుడు ఇవ్వబోమని చావుకబురు చల్లగా చెప్పిందన్నారు. పైగా ఎండాకాలానికి సంబంధించి మంత్రుల కమిటీ నివేదిక ఇచ్చాక ఇస్తామంటున్నారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం ఏడాదికి రెండుసార్లు కచ్చితంగా రైతుబంధు ఇచ్చిందని గుర్తు చేశారు. డిసెంబర్ 9న రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. పది నెలలైపోయింది. 30 శాతం మందికి మాత్రమే మాఫీ చేసి, మిగతా వారికి ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారని ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ హామీ ఇచ్చినట్లు అన్ని పంటలకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గంగపుత్రులకు అండగా కేసీఆర్..

దళారుల చేతుల్లో మోసపోతున్న గంగపుత్రులను ఆదుకునేందుకే కేసీఆర్ ఉచిత చేపపిల్లల పంపిణీని ప్రారంభించారని వేముల చెప్పారు. దీనివల్ల వేలాది గంగపుత్రుల కుటుంబాల్లో వెలుగులు నిండాయన్నారు. కానీ కాంగ్రెస్ వచ్చాక చేపపిల్లల పంపిణీని సగానికి తగ్గించిందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో ఏటా ఎస్సారెస్పీలో 62 లక్షల చేప పిల్లలు వదిలామని, కానీ ఈసారి 31 లక్షలు మాత్రమే వదులుతున్నట్లు తెలిపారు. గతంలో నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 4.42 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేస్తే, ఈసారి కాంగ్రెస్ సర్కారు 2.20 కోట్లు మాత్రమే పంపిణీ చేసిందన్నారు. ఖజానాలో డబ్బులు మిగుల్చుకునేందుకు గంగపుత్రుల పొట్ట కొట్టొద్దని, వారిని ఆదుకోవాలని ప్రశాంత్‌రెడ్డి ప్రభుత్వానికి సూచించారు. గంగపుత్రుల కోసం తాము సర్కారుతో కొట్లాడుతామని చెప్పారు. కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, సొసైటీల చైర్మన్లు రేగుంట దేవేందర్, బాపురెడ్డి, గడ్డం స్వామి, నేతలు పాల్గొన్నారు.

బీసీ కమిషన్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

సన్నాహక సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

కంఠేశ్వర్, అక్టోబర్ 26: స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఈ నెల 29న బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం రానున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలోని బృందానికి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిజామాబాద్ జిల్లాకు చెందిన వారు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కామారెడ్డి జిల్లా ప్రజలు రాతపూర్వకంగా అభిప్రాయాలను నివేదించవచ్చని తెలిపారు. డీసీపీ కోటేశ్వర్‌రావు, డీఆర్డీవో సాయాగౌడ్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి స్రవంతి, ఆర్డీవో రాజేంద్రకుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేశ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం పేరిట రోడ్లపైకి రావొద్దు..

ఏడో బెటాలియన్ సిబ్బందికి ఇన్‌చార్జి సీపీ సూచన

డిచ్‌పల్లి, అక్టోబర్ 26 : సమస్యల పరిష్కారం పేరిట రోడ్లపైకి రావొద్దని ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ ఏడో బెటాలియన్ పోలీసులకు సూచించారు. ఒకే పోలీసు విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బెటాలియన్ పోలీసు కుటుంబాలు రాస్తారోకో చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం బెటాలియన్‌కు వచ్చిన సీపీ.. సిబ్బందితో సమావేశమయ్యారు. విధి నిర్వహణలో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకరావాలన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బెటాలియన్ పోలీసులు చేపట్టాలనుకున్న బైక్ ర్యాలీని రద్దు చేశారు. కొన్ని బెటాలియన్లలో నిరసనలు చేపట్టినట్లు తెలియడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. బదులుగా బెటాలియన్‌లోని అమరవీరుల స్థూపం వద్ద మౌనం పాటించి నివాళులర్పించారు.

కామారెడ్డి కేంద్రంగా అక్రమ దందా
పక్క జిల్లాలు, పొరుగు రాష్ట్రాల నుంచి రాక
తరచూ వెలుగులోకి వస్తున్న ఘటనలు
పదేపదే పట్టుబడుతున్న వ్యక్తులు
కేసులు పెట్టినా మారని మనుషులు
స్కానింగ్ కేంద్రాల్లోనూ గుట్టుగా వ్యవహారం
కఠిన చర్యలు చేపట్టడంలో సర్కారు విఫలం

పుట్టక ముందే గుట్టు విప్పేస్తున్నారు

యథేచ్ఛగా లింగ నిర్ధారణ

కొందరు అక్రమార్కులు బరి తెగించారు. కాసుల మోజులో.. బిడ్డ పుట్టక ముందే గుట్టు విప్పేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసి ఆడో, మగో తేల్చేస్తున్నారు. ఈ క్రమంలో కళ్లు తెరవని బిడ్డని కడుపులోనే తుంచేస్తున్నారు. తల్లి కడుపు నుంచి బయట పడకుండానే గర్భస్థ శిశువులకు 'పిండం' పెట్టేస్తున్నారు. ఇంతటి దారుణాలకు కామారెడ్డి కేంద్రంగా మారింది. లింగ నిర్ధారణ పరీక్షల కోసం పక్క జిల్లాలే కాదు, పొరుగు రాష్ట్రాల నుంచీ కస్టమర్ల రాక పెరిగింది. తరచూ లింగ నిర్ధారణ కేసులు వెలుగు చూస్తుండడం, అదే వ్యక్తులు పదేపదే పట్టుబడుతుండడం సర్కారు నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్నది. మొదటిసారి పట్టుబడినప్పుడే కఠిన చర్యలు చేపట్టక పోవడంతో అక్రమార్కుల్లో భయం లేకుండా పోయింది.

-నిజామాబాద్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

కొంత మంది అక్రమార్కులు పవిత్రమైన వైద్య వృత్తికి కళంకం తెచ్చేలా వ్యవహరిస్తున్నారు. మొన్ననే గాంధారి మండల వైద్యాధికారి.. లింగ నిర్ధారణ కేసులో పట్టుబడి జైలుకు వెళ్లిన ఘటన మరువక ముందే మరో వైద్యుడి లీలలు వెలుగులోకి వస్తున్నాయి. గతంలోనూ ఇలాంటి కేసుల్లో పట్టుబడిన సదరు వ్యక్తి.. చేసిన తప్పులనే పదే పదే చేస్తూ చట్టానికే సవాల్ విసురుతున్నాడు. పైగా మొబైల్ సేవలు కూడా అందిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. పల్లెలతో పాటు పక్క జిల్లాలు, సరిహద్దు రాష్ట్రాల్లో బ్రోకర్లను పెట్టుకుని అక్రమాలకు తెర లేపారు. గర్భిణులను కామారెడ్డికి తరలించి కడుపులో ఉన్నది ఆడబిడ్డ, మగబిడ్డనా? అని తేల్చేస్తూ రూ.లక్షలు దండుకుంటున్నారు. ఈ మధ్యే వెలుగు చూసిన ఘటనలో మహారాష్ట్ర నుంచి ఓ జంట వచ్చి గుట్టుగా లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నది. అయితే, ఇది తెలిసి మహారాష్ట్ర పోలీసులు వచ్చి వైద్యుడ్ని అరెస్టు చేయడంతో జిల్లాలో జరుగుతున్న దారుణాలు బయటకొచ్చాయి.



వైద్యారోగ్య శాఖలో ఇంటి దొంగలు..

ప్రైవేటు దవాఖానలతో వైద్యారోగ్య శాఖ ఉద్యోగులకు సత్సంబంధాలున్నాయి. ఈ క్రమంలోనే లింగ నిర్ధారణ పరీక్షల వ్యవహారంలో ఇంటి దొంగల హస్తమున్నట్లు అనుమానాలు బలపడుతున్నాయి. వైద్యారోగ్య అధికారులు, పోలీసులు ప్రత్యేకంగా బృందాలు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ ఎంతకూ అక్రమాలకు కళ్లెం పడడం లేదు. ముఖ్యంగా దాడులకు సంబంధించిన సమాచారాన్ని కొందరు వైద్యారోగ్య శాఖ సిబ్బంది ముందుగానే బయటికి చెప్పేస్తున్నారని, తద్వారా అక్రమార్కులు చిక్కకుండా తప్పించుకుంటున్నారని ప్రచారం జరుగుతున్నది. కలెక్టర్ లేదా ఎస్పీ స్వయంగా రంగంలోకి దిగితేనే కానీ లింగ నిర్ధారణ దందాలో గొలుసు కట్టు సంబంధాలను నియంత్రించలేని పరిస్థితి నెలకొన్నది. లేదంటే తరచూ ఇలాంటి ఘటనలు వెలుగు చూస్తూనే ఉంటాయి.

ఎన్నెన్ని అక్రమాలో..

కామారెడ్డి అడ్డాగా అనేక అక్రమాలు జరుగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ దండుకుంటున్నారు. పుట్టబోయేది ఆడబిడ్డ, మగబిడ్డనో తేల్చేస్తున్నారు. ఆడబిడ్డ అని తేలిన దంపతులు గర్భస్థ శిశువును వదులుకునేందుకు సిద్ధపడుతున్నారు. ఈ క్రమంలో కొందరు వైద్యులు అక్రమంగా అబార్షన్లు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అనుకోకుండా గర్భం దాల్చిన పెళ్లి కాని యువతుల పరిస్థితిని అవకాశంగా మలుచుకుంటున్నారు. భారీగా డబ్బులు వసూలు చేస్తూ పిండాన్ని తుంచేస్తున్నారు. భర్తకు తెలియకుండా గర్భం దాల్చిన ఓ వివాహిత ఇటీవల గర్భవిచ్ఛిత్తి చేయించుకోగా, ఈ దారుణంపై భర్త పోలీసులను ఆశ్రయించడంతో కామారెడ్డిలో అబార్షన్ల దందా మరోసారి చర్చనీయాంశమైంది. మరోవైపు, శిశు విక్రయాలు సైతం గతంలో వెలుగు చూసిన ఉదంతాలు ఉన్నాయి. బిడ్డలు అవసరం లేని గర్భిణులు ప్రసవం కాగానే వదిలించుకోవడం, ఆ నవజాత శిశువులను దవాఖాన నిర్వాహకులు వేలానికి పెట్టిన ఘటనలు వెలుగు చూశాయి. లింగ నిర్ధారణ పరీక్షలు, అక్రమ అబార్షన్లు, శిశు విక్రయాలకు సంబంధించి కేసులు సైతం నమోదయ్యాయి. అయితే, మొదట్లోనే అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుని ఉంటే మళ్లీ ఇలాంటి ఉదంతాలు జరిగేవి కావు. కానీ ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల కాసుల కక్కుర్తిని అవకాశంగా మలుచుకుని అవే తప్పులు చేస్తున్నారు.

పర్యవేక్షణ కరువు..

కామారెడ్డి జిల్లా లింగ నిర్ధారణ పరీక్షలకు కేంద్రంగా మారిన తరుణంలో పర్యవేక్షించాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. అటు వైద్యారోగ్య శాఖ, ఇటు పోలీసు శాఖ దవాఖానలు, స్కానింగ్ సెంటర్లు, అక్రమార్కులపై నిఘా పెట్టాల్సి ఉండగా, అటువైపు కన్నెత్తి చూడడం లేదు. హెల్మెట్ లేకపోవడం, సిగ్నల్ జంపింగ్ వంటి చిన్న చిన్న నేరాలకే సామాన్యులను సతాయిస్తున్న పోలీసులు.. గర్భస్థ శిశువుల గుట్టు తేల్చే వైద్యులు, పిండానికే పిండం పెట్టే డాక్టర్లను పట్టుకోవడం, కఠినంగా శిక్షలు పడేలా చేయడం చేతకాక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తొలి కేసు వెలుగు చూసినప్పుడే సంబంధీకులను గట్టిగా బిగిస్తే ఉన్న ఈ అక్రమాలకు అవకాశమే ఉండేది కాదన్న వాదన బలంగా వినిపిస్తున్నది. మరోవైపు, లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారితో పాటు పరీక్షలు చేయించుకుంటున్న వారిని సైతం కేసుల్లో ఇరికిస్తే, మిగతా వారు ముందుకొచ్చే వీలుండదని సామాజిక వేత్తలు చెబుతున్నారు.

కఠిన చర్యలు తప్పవు..

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే దవాఖానల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయడంతో పాటు కేసులు సైతం పెడతాం. జిల్లాలో ఈ పరీక్షల నియంత్రణకు కమిటీ ఉన్నా ఈ విషయంలో మాకు ఫిర్యాదులు రావడం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే సత్వర చర్యలు తీసుకుంటాం.

- చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో, కామారెడ్డి

రెండు స్కానింగ్ యంత్రాలు సీజ్

శ్రీరాంనగర్ కాలనీలోని ఓ ఇంట్లో ఉన్న లింగ నిర్ధారణ యంత్రాన్ని సీజ్ చేస్తున్న అధికారులు

కామారెడ్డి, అక్టోబర్ 26: కామారెడ్డిలో రెండు స్కానింగ్ (సోనోగ్రఫీ) యంత్రాలను సీజ్ చేసినట్లు డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ శనివారం తెలిపారు. కారులో స్కానింగ్ మిషన్‌ను తరలిస్తుండగా, పక్కా సమాచారంతో పోలీసులు, వైద్యారోగ్యశాఖ అధికారులు అశోక్‌నగర్ రైల్వేగేట్ వద్ద పట్టుకున్నారు. డ్రైవర్‌ను విచారించగా, మరో అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ శ్రీరాంనగర్ కాలనీలోని ఓ ఇంట్లో ఉందని సమాచారమిచ్చాడు. దీంతో అధికారులు ఆ మిషన్‌ను కూడా స్వాధీనం చేసుకుని పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్ కింద సీజ్ చేసినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. పట్టణానికి చెందిన ఇట్టం సిద్దిరాములుకు సంబంధించిన కారులో లింగ నిర్ధారణ యంత్రం లభించిందన్నారు. అలాగే, ఓ ఇంట్లో మరో యంత్రాన్ని స్వాధీనం చేసుకుని, కోర్టులో సమర్పించినట్లు తెలిపారు. గతంలో కూడా సిద్దిరాములు కుటుంబానికి సంబంధించిన వారు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ పట్టుబడగా, తాజాగా వారి కారులోనే మిషన్ దొరకడం కలకలం రేపింది.